క్లుప్తంగా

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలో వేంచేసిన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

హరేరామ మందిరంలో పూజలు



సామూహిక పూజలు చేస్తున్న దంపతులు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిర పునః ప్రతిష్టా ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు పూజలు జరిగాయి. అర్చకులు పెంట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో మంటప ఆరాధనలు, విశేష కుంకుమార్చనలు, మహాన్యాస పూర్వక మహాభిషేకం, ప్రతిష్టా విగ్రహాలకు ధాన్యదివాసం, పంచశయ్యాదివాసంలో భాగంగా నూతన వస్త్రాలపై మూర్తులను ఉంచారు. కళాహోమం చేపట్టారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు సాధు అప్పన్న, గ్రామ పెద్దలు చిట్టి నాగభూషణం, రెడ్డి చిరంజీవులు, సాధు వైకుంటరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్ అందజేస్తున్న దాత

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన రౌతు ఇందిర రూ.100,116 విరాళం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావుకు చెక్ అందించారు. కార్యక్రమంలో దాత తల్లిదండ్రులు రౌతు నరేంద్రబాబు, భారతి దంపతులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లాలో బీజేపీ ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి మల్లేశ్వరి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో కమిటీ సమావేశం బుధవారం జరిగింది. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిట్టిబరికి లింగరాజును నియమించినట్టు వెల్లడించారు. ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారావు, గిరాబాబు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై మక్కువ చూపాలి



మాట్లాడుతున్న ఏవో విజయభాస్కర్

రణస్థలం: చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువ చూపాలని మండల వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్ అన్నారు. క్రిష్టాపురం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ చిరుధాన్యాల ఏడాదిగా 2023 సంవత్సరాన్ని జరుపుకుంటున్నామన్నారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు వంటి పంటలు పండించాలన్నారు. సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో సచివాలయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి



భద్రతపై చర్చిస్తున్న పోలీసు అధికారులు

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలో గురువారం జరగనున్న షిర్డీ సాయిబాబా యాత్రలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని రణస్థలం సీఐ ఆదాం అన్నారు. జి.సిగడాం ఎస్సై సామాంతుల రామారావు, ఏఎస్సై రామకృష్ణతో కలిసి బుధవారం ఆనందపురంలో పర్యటించి జాతర ఏర్పాట్లు పరిశీలించారు.

విద్యార్థినికి అభినందన

శ్రీకాకుళం న్యూకాలనీ: కర్ణాటకలోని హుబ్బలిదార్వాడ్‌లో జరిగిన 26వ జాతీయ యువజనోత్సవాల్లో శ్రీకాకుళంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.ఉషాపద్మ ప్రతిభ కనబర్చింది. ప్రథమ సంవత్సరం చదువుతున్న ఉషాపద్మ ఏకపాత్రాభినయ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటింది. కళాశాల డైరెక్టర్ బీవీ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎస్వీ వేణుగోపాల్ బుధవారం కళాశాలలో విద్యార్థినిని అభినందించారు.

ఓటే వజ్రాయుధం

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ప్రతిజ్ఞ చేసిన యువత



లావేరు: మురపాక కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు



రణస్థలం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



జి.సిగడాం: పెంట యూపీ పాఠశాల ఆవరణలో విద్యార్థుల మానవహారం



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌వో మురళీకృష్ణ, అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థుల ప్రతిజ్ఞ

రణస్థలం: ప్రజా హక్కుల సాధనకు, ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధంగా పని చేస్తోందని జిల్లా ప్రత్యేక ఉప కలెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి పి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామతీర్థాలు కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఓటు హక్కుపై వివిధ కళాశాలల విద్యార్థులచే అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నూతనంగా వచ్చిన ఓటరు కార్డులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఉత్తమ బూత్ లెవెల్ అధికారులైన కె.అశ్విని, వి.కేశవరావు, వై.తవిటయ్య, పి.తులసిలకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. వ్యాసరచన, ముగ్గుల పోటీల విజేతలైన కె.కల్యాణి, పి.డిల్లేశ్వరి, డి.కల్యాణి, దావిద్‌లకు షీల్డ్‌లు అందించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం పాల్గొన్నారు.

ర్యాలీలు, మానవహారాలు

లావేరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. బూత్‌లెవిల్ అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, విద్యార్థులు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో ర్యాలీలు, మానవహారాలు చేపట్టి ఓటు అవశ్యతకను ప్రజలకు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధ, మురపాక గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు ఎం.వాసుదేవరావు, సీఆర్‌పీ జి.సూర్యనారాయణ, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



జి.సిగడాం: అద్వానంపేట పాఠశాలలో ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఓటరుగా చేరాలి

ఎచ్చెర్ల క్యాంపస్: 18 సంవత్సరాలు నిండినవారంతా ఓటు హక్కు కలిగి ఉండాలని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ అన్నారు. కుశాలపురం గ్రామ సచివాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో శతశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో కూడా ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ముద్దాడలో..

ఎచ్చెర్ల: ముద్దాడ ప్రాథమిక పాఠశాలలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సుమ లత, గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఓటు అవశ్యకతను ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు వివరించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి

జి.సిగడాం: అర్హులందరూ ఓటురుగా నమోదుచేసుకోవాలని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అన్నారు. పెంట యూపీ పాఠశాలలో ఓటరు దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. అద్వానంపేట ఎంపిపి పాఠశాలలో హెచ్‌ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు.



లావేరు: బహుమతులు అందజేస్తున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ సుధ

పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి

లావేరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధ అన్నారు. మురపాకలోని శాఖాగ్రంథాలయంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ సుధ, గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో..

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల, మహిళా డిగ్రీ కళాశాలల్లో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని జరిగింది. విద్యార్థులు, అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాపూజీ కళామందిరం వరకు విద్యార్థినులతో ర్యాలీ చేశారు. పురుషుల డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యన్నారాయణ అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఓటర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఓట్ ఆకృతిలో విద్యార్థులు అక్షరమాలగా ఏర్పడ్డారు.

విద్యుత్ బీసీ ఉద్యోగులకు విశాఖలో బిల్డింగ్

- మంత్రి సీదిరి అప్పలరాజు హామీ

సాక్షి, అమరావతి: విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘానికి విశాఖలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించేలా కృషి చేస్తానని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ డైరీని బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యుత్ కార్యాలయాల ఆవరణలో మహాత్మా జ్యోతీరావ్ పూలే విగ్రహాల స్థాపనకు, బీసీ ఉద్యోగులను కీలక పోస్టుల్లో నియమించడానికి, సాధారణ బదిలీల్లో అన్ని యూనియన్ల అసోసియేషన్లతో పాటు సమానంగా బీసీ యూనియన్ నాయకులకు ట్రాన్స్‌ఫర్ నుంచి మినహాయింపు కల్పించడానికి కూడా ప్రభుత్వం ద్వారా ప్రయత్నం చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరావు, జనరల్ సెక్రటరీ వి.అనూరాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేంద్రం శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ గుణవంతుడు, అడ్వైజర్ చంద్రమౌళి, 13 ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సభ్యులు, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

తపాలా ఉద్యోగులను ఇబ్బందిపెట్టొద్దు



ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా ఉద్యోగులను మానసికంగా క్షోభకు గురిచేయడం తగదని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అన్నారు. తపాలా ఉద్యోగులకు విధించిన టార్గెట్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా అన్ని తపాలా కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కరోజులో కోటి కొత్త పోస్టల్ ఖాతాలు తెరవాలని, ఫిబ్రవరి 9, 10 తేదీలలో 7.5లక్షల కొత్త సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవాలని లక్ష్యాలను నిర్దేశించడం తగదన్నారు. దీంతో ఉద్యోగులంతా మానసికంగా వేదనకు గురవుతున్నారని చెప్పారు. సంస్థలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించి దాదాపు పదేళ్లు కావస్తున్నప్పటికీ సరైన నెట్‌వర్క్ సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఫలితంగా ఖాతాదారులకు సరైన సదుపాయాలు అందడం లేదన్నారు. తాజాగా టార్గెట్లు నిర్దేశించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌పీఈ నాయకులు జ్యోతీశ్వరరావు, బాబూరావు, రమేష్, రాంబాబు, గౌరీ, నారాయణరావు, పాత్రో, చంద్రకిరణ్ పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో సిక్కోలుకు గుర్తింపు

శ్రీకాకుళం న్యూకాలనీ: పర్యాటక ప్రదేశాలకు శ్రీకాకుళం పెట్టింది పేరని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రదేశాలతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రదేశాలు చాలా ఉన్నాయన్నారు. అవి అభివృద్ధి చెందితే ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గిరిజన ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి చెందితే గిరిజనులకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించి, వారి జీవన ప్రమాణాలు మరింతగా పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన పర్యాటక ప్రదేశాలు మన జిల్లాలో ఉన్నాయని, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరసవల్లి వంటి ప్రదేశాలకు విదేశీయులు సందర్శించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కేబీఎం సింగ్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, గీతా శ్రీకాంత్, ఇంటాక్ కన్వీనర్ కేవీకే రాధాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జి.సిగడాం: వలంటీర్లు, గ్రామ కన్వీనర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్ సీపీ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి, చిత్తిరి మోహన్ కోరారు. ఆనందపురం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో గృహ సారథులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. సర్పంచులు వడిశ మహేశ్వరావు, చిత్తిరి మంజు పాల్గొన్నారు.

వరికుప్పలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: తండేవలస పంచాయతీ పరిధి బెండివానిపేట గ్రామంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో గొద్దు చిరంజీవికి చెందిన రెండు ఎకరాల వరి కుప్పలతో పాటు మరో రెండు ఎకరాల గడ్డి వాములు దగ్ధమయ్యాయి. మంటలు వ్యాపించడాన్ని చూసిన స్థానికులు అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేయగా సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రాథమికంగా అంచనా వేశారు. ఎవరో సిగరెట్ కాల్చి పడేయడంతో మంటలు వ్యాపించి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. ఫైర్ సిబ్బంది కేసు నమోదు చేసుకున్నారు. స్థానిక సర్పంచ్ పొన్నాన కూర్మారావు బాధితులను పరామర్శించారు.

వేతనదారులు గరిష్ట వేతనం పొందాలి

గార: ఉపాధి వేతనదారులు గరిష్ట వేతనం వచ్చేలా పనిచేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. అంపోలు పంచాయతీ మంగళవారంపేటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజుకి రూ. 257 వేతనం పొందేలా వేతనదారులు పనిచేయాలన్నారు. తద్వారా మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరవుతాయన్నారు. గ్రామాల్లో ఆర్థిక అసమానతలు రూపుమాపడంతో పాటు వలసల నివారణ కోసం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. నరసన్నపేట క్లస్టర్ ఏపీడీ యుగంధర్, ఏపీవో సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ పుష్పకథ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభం

రణస్థలం: ప్రాణాపాయ స్థితిలో ఉండేవారికి ఆక్సిజన్ ఎంతో అవసరమని జిల్లా అదనపు వైద్యాధికారిణి అనురాధ అన్నారు. రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమకూర్చిన రూ. 22 లక్షలు, ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 23 లక్షతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ రహదారిని అనుకుని ఉన్న సీహెచ్‌సీకి ఆక్సిజన్ ప్లాంట్ చాలా అవసరం అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులకు తక్షణమే ప్రాణవాయువు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ లభ్యకాక చాలామంది ఇబ్బందులు పడిన విషయం విదితమేనన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మారుమూల ప్రాంతాల్లోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో కూడా అధునాతనమైన పరికరాలతో ఆక్సిజన్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజారోగ్యం కోసం నెలకొల్పిన ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా టీబీ రోగులకు రెడ్డీస్ ఫౌండేషన్ సమకూర్చిన పోషకాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ యూనిట్ హెడ్ కె.వి.ఎస్.ఎస్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వి.ప్రసాద్, వైద్యులు ఆర్.కుమార్, ఎం.సునీల్ కుమార్, టీయూ మెడికల్ అధికారి కిశోర్, సిబ్బంది ఎ.యు.బి.శర్మ, భాస్కరరావు, రమణ, శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్ల వెంకటరెడ్డి ఉన్నారు.



ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అనురాధ

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

లావేరు: గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, పైలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్టు కీటక జనిత వ్యాధి నివారణ సబ్ యూనిట్ అధికారి సురేష్ చెప్పారు. బుడుమూరులోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పర్యటించి ఇళ్ల వద్ద నీటి నిల్వలను, జనావాసాల మధ్య గల మురుగునీటి గుంతలను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి గ్రామస్తులకు తెలియజేశారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు ఉండటం వలన దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని.. ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేయకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఓ ఇంటి వద్ద డ్రమ్ముల్లో నిల్వ చేసిన నీటిని బయటకు పారబోయించారు. ఆయనతో పాటు హెల్త్ అసిస్టెంట్ ఆర్.ఎల్.ఎస్. శ్యామ్‌సుందర్, ఏఎన్‌ఎం వరహాలు, ఎంఎల్‌హెచ్‌పీ బి.యామిని, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



డ్రమ్ములో నిల్వ చేసిన నీటిని బయటకు పారబోయిస్తున్న అధికారులు

విద్యార్థులకు హెచ్‌ఎం ఆర్థిక సాయం



విద్యార్థిని కృపాజ్యోతికి సాయం అందజేస్తున్న భూపతిరావు

లావేరు: బుడతవలస గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు బొడ్డేపల్లి భూపతిరావు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థిని మీసాల సుస్మిత తండ్రి మృతి చెందారు. దీంతో విద్యార్థిని చదువుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం రూ. రెండు వేలు, మరో విద్యార్థిని బుడుమూరు కృపాజ్యోతికి చదువు నిమిత్తం మూడు వేల రూపాయలు అందజేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను సమకూర్చారు. అలాగే విద్యార్థులకు ట్యూషన్ చెప్పేందుకు నియమించిన వలంటీర్ హరికృష్ణకు పది వేల రుపాయలను అందించి ఆదర్శంగా నిలిచారు. హెచ్‌ఎం భూపతిరావును గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో మెట్టవలస ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మజ్జి మురళీకృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వరుస క్రమంలో వరి నాట్లు వేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వరుస క్రమంలో రబీలో వరి నాట్లు వేయాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనుంజయ్ సూచించారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో రబీ వరి నాట్లు బుధవారం వేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగులో ముందుగా వరస క్రమంలో నాట్లు వేయటం, దూరం పాటించటం, గాలిబాటలు విడిచి పెట్టం కీలకంగా చెప్పారు. ఈ విధానం వల్ల దుబ్బు పెరుగుదల, గాలి, వెలుతురు పంటకు బాగా సోకి మంచి దిగుబడి వస్తోందన్నారు. తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చునన్నారు. జీవామృతం ఉపయోగించటం, కషాయాలు వినియోగం కీలకమన్నారు. రైతులందరు ఒకే విధమైన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జగన్, శ్రీదేవి, హరేరామ పాల్గొన్నారు.



వరుస క్రమంలో నాట్లు వేస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేరువ చేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. యర్రవరం గ్రామ సచివాలయం పరిధిలోని సురాపురం, పెదయాతపేట, రెడ్డిపేట, చుక్కపేట గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 224 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసి సంబంధిత బుక్‌లెట్ అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయిపు రెడ్డి భుజంగరావు, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, గొర్లె అప్పలనర్సునాయుడు, లంకలపల్లి ప్రసాద్, మహంతి చిన రామినాయుడు, బడి రాంబాబు, గ్రామ నాయకులు లంక సీతంనాయుడు, రెడ్డి అప్పలనాయుడు, మింది జనార్దన్ రెడ్డి, మింది శ్రీనివాస రెడ్డి, రాజారావు, లంక రమణ, వాసుదేవరావు, రెడ్డి రమణ, రెడ్డి సూర్యనారాయణ, బాసి రమణ, దుంప అక్కుల రెడ్డి, తాతారావు, అప్పలనాయుడు, రమణారావు, రెడ్డి గోవింద, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రాష్ట్రంలోనే ధరలు తక్కువ

- ఎల్లో మీడియా దుష్ప్రచారాలు నమ్మవద్దు
- వైఎస్సార్‌సీపీ యువనేత రామ్‌మనోహర్ నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిత్యావసరాల ధరలు రాష్ట్రంలోనే తక్కువగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు చెప్పారు. ధరలు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పెరిగినప్పటికీ.. ఏపీలో మాత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలతో తక్కువగా ఉన్నాయన్నారు. ధరలు పెరుగుతున్నట్టు ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ, ఎల్లో మీడియా ప్రయత్నిస్తున్నాయన్నారు. సంక్రాంతి ముందు హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో విజయ నూనే ప్యాకెట్ కొనుగోలు చేయగా.. ధర రూ.159 ఉండగా.. అదే నూనే ప్యాకెట్ ఏపీలో రూ.153 ఉందన్నారు. దీనికి సంబంధించిన బిల్లులను చూపించి ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఎవ్వరికైనా అనుమానం ఉంటే తనతో నేరుగా మాట్లాడితే.. తెలంగాణా, ఏపీలో ధరల్లో తేడాలను ఆధారాలతో చూపిస్తానన్నారు.



ధరల్లో తేడాను బిల్లులతో సహా చూపిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు